AKSHARA TODAY
# అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

**రాములోరి కల్యాణానికి సర్వంసిద్ధం** 2





**జాతీయ అవార్డుల ప్రదానం** 2

## బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శ్రీరాముడి శోభాయాత్ర



**అక్షరటుడే, పెద్దకొడప్ గల్:** మండలంలోని వివిధ గ్రామాల్లో శ్రీరాముడి శోభాయాత్రలను గురువారం ఘనంగా నిర్వహించారు. పోచారం గ్రామంలో సర్పంచ్ బాలాజీ పాటిల్, సీతా బాయి రాముని చిత్రపటానికి పూలమాల వేసి కొబ్బరికాయలు కొట్టి యాత్రను ప్రారంభించారు. పోచారం గ్రామ హనుమాన్ మందిరం నుంచి సాగిన యాత్ర పోచారం తండాలో ప్రధాన వీధుల మీదుగా సాగింది.

26-3-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

## బాన్సువాడ బస్టాండ్‌కు మరమ్మతులు చేపట్టాలి



**అక్షరటుడే, బాన్సువాడ :** బాన్సువాడ బస్టాండ్ శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిందని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సమస్యను తెలంగాణ శాసనసభ కమిటీ హాల్‌లో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి గురువారం తీసుకెళ్లారు. బాన్సువాడ ప్రాంతానికి సంబంధించిన రవాణా సమస్యలు, ముఖ్యంగా ఆర్టీసీ బస్టాండ్ పరిస్థితిపై మంత్రికి వివరించారు. ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు బాన్సువాడ బస్టాండ్‌ను ఉపయోగిస్తున్న నేపథ్యంలో తక్షణమే మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. పాడైన షెడ్లు, చెడిపోయిన వసతులు, భద్రతా లోపాలు ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని వివరించారు. ఈ అంశంపై మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించారు. బాన్సువాడ ఆర్టీసీ బస్టాండ్ మరమ్మతు పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు.

## సామాన్యులకు ఇబ్బంది కలగొద్దు..



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** శ్రీరామ నవమి సందర్భంగా నిర్వహించే ర్యాలీల్లో సామాన్య ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని సీపీ సాయి చైతన్య సూచించారు. కమిషనరేట్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ హాల్‌లో గురువారం శ్రీరామనవమి, హనుమాన్ ర్యాలీ నిర్వహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ర్యాలీలో పోలీస్ నియమ నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలన్నారు. ప్రతిఒక్కరూ ప్రశాంతంగా భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. ఇతరులకు, సామాన్య ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. ఎవరైనా చట్ట వ్యతిరేకంగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. శ్రీరామ నవమి, హనుమాన్ జయంతి శోభాయాత్రను గత ఏడాది జరిగిన మాదిరిగానే ఆయా రూట్లలోనే అనుమతి ఉందన్నారు. సమావేశంలో అదనపు డీసీపీ (అడ్మిన్) బస్వారెడ్డి, నిజామాబాద్ టౌన్ ఏసీపీ ప్రకాష్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, సీఐలు, ఎస్సైలు, విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దల్, ఆర్య సమాజ్, హిందువాహిని, ఏబీవీపీ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంపై జీవన్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తున్నాం..



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి జీవన్ రెడ్డి చేసిన ఆరోపణలను ఖండిస్తున్నామని రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి అన్నారు. అయితే ఆయన పార్టీని వీడడం బాధగానే ఉందన్నారు. ఈ మేరకు గురువారం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడారు. జీవన్ రెడ్డి తన స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీ వీడి వెళ్తూ ఆరోపణలు చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలనకు తెరదింపిన వ్యక్తి రేవంత్ రెడ్డి అన్నారు. వయసుకు, విజ్ఞతకు దగ్గట్టుగా మాట్లాడాలని జీవన్‌రెడ్డికి హితవు పలికారు. పార్టీ అధిష్టానం నిర్ణయాల మేరకే చేరికలు ఉంటాయన్నారు. జీవన్‌రెడ్డి తన పోరాటాన్ని సీఎం రేవంత్ రెడ్డిపై కాకుండా ప్రజా సమస్యలపై చేస్తే బాగుంటుందని మానాల మోహన్ రెడ్డి వ్యాఖ్యానించారు. వేం నరేందర్ రెడ్డి క్లిష్ట కాలంలో పార్టీకి సేవలందించారని గుర్తు చేశారు. తొమ్మిదేళ్లుగా కాంగ్రెస్ పార్టీ ఉన్నతి కోసం పనిచేసిన వ్యక్తి వేం నరేందర్ రెడ్డి అన్నారు. సమావేశంలో పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లపై అనాసక్తి..



**పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశ పెట్టింది. తొలి విడతలో జిల్లాలో 17,381 మందికి ఇళ్లు మంజూరు చేసింది. అయితే పలువురు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో పనులు ముందుకు సాగక.. ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. కొందరు ఇప్పటి వరకు ముగ్గు పోయాక పోగా.. పలువురు మధ్యలో నిర్మాణాలను ఆపేశారు.**

**-అక్షరటుడే, భీమ్‌గల్**

- **మంజూరైనా సాగని పనులు**
- **నిర్మాణానికి ముందుకు రాని పలువురు లబ్ధిదారులు**
- **జిల్లాలో ముగ్గు పోయని ఇళ్లు 4,200**
- **రద్దు చేసే దిశగా సర్కారు యోచన**

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం జిల్లాలో నత్తనడకన సాగుతోంది. సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోలేని నిరుపేదలకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలన్న ప్రభుత్వ లక్ష్యం క్షేత్రస్థాయిలో నీరుగారుతోంది. జిల్లావ్యాప్తంగా వేలాది మందికి ఇళ్లు మంజూరైనప్పటికీ, నెలలు గడుస్తున్నా పునాదుల నిర్మాణానికి కూడా లబ్ధిదారులు ముందుకు రాకపోవడం గమనార్హం.

### 375 ఇళ్లు పూర్తి

జిల్లావ్యాప్తంగా మొత్తం 17,381 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. అందులో 13,180 మంది లబ్ధిదారులు మాత్రమే ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. వీటిలో కేవలం 375 ఇళ్లు మాత్రమే ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో నిర్మాణమయ్యాయి. మిగిలిన ఇళ్లు వివిధ దశల్లో (బేస్‌మెంట్, రూఫ్, స్లాబ్) ఉన్నాయి. అయితే సుమారు 4,200 మందికి పైగా లబ్ధిదారులు ఇళ్లు మంజూరై ఆరు నెలలు గడుస్తున్నా కనీసం పునాదుల నిర్మాణానికి (ముగ్గు పోయడానికి) సిద్ధంగా లేకపోవడం అధికారులను విస్మయానికి గురి చేస్తోంది.

### అధికారుల హెచ్చరికలు

నిర్మాణాల్లో జాప్యం చేస్తున్న లబ్ధిదారుల వివరాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే ఏఈలు, డీఈలు క్షేత్రస్థాయిలో పర్యటించి లబ్ధిదారుల సమస్యలను తెలుసుకున్నారు. అయినప్పటికీ స్పందన కరువవడంతో, గడువులోగా పనులు ప్రారంభించని వారి మంజూరును రద్దు చేసి, వేచి చూస్తున్న ఇతర అర్హులకు ఆ అవకాశం కల్పించాలని ప్రభుత్వం యోచిస్తోంది. దశలవారీగా రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందుతున్నప్పటికీ.. నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదల, వ్యక్తిగత కారణాలతో కొందరు వెనుకడుగు వేస్తున్నట్లు సమాచారం. గృహ నిర్మాణ శాఖ నుంచి త్వరలోనే దీనిపై స్పష్టమైన ఆదేశాలు వెలువడే అవకాశం ఉంది. కాగా.. ఇళ్లు మంజూరు కాని చాలా మంది రెండో దశ కోసం నిరీక్షిస్తున్నారు. ఈ క్రమంలో తొలిదశలో పనులు చేపట్టని వారికి రద్దు చేసి.. ఇతర అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

**జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల వివరాలు**

| | |
|---|---|
| మంజూరైన ఇళ్లు | 17,381 |
| గ్రౌండింగ్ చేసినవి | 13,180 |
| బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్నవి | 10,364 |
| రూఫ్ లెవల్‌లో ఉన్నవి | 7,488 |
| స్లాబ్ స్థాయిలో ఉన్నవి | 5,887 |
| పూర్తయినవి | 375 |
| ముగ్గు పోయనివి | 4,200 |
| ముగ్గు పోసినా పనులు మొదలు కానివి | 2,800 |

## రైతులకు నష్టపరిహారం అందేలా చూస్తా: షబ్బీర్ అలీ

**అక్షరటుడే, కామారెడ్డి :** వడగండ్ల వానతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందేలా తనవంతు కృషి చేస్తానని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ భరోసా ఇచ్చారు. భిక్కనూరు మండలం కంచర్ల, పెద్దమల్లారెడ్డి గ్రామాల్లో పంటలను గురువారం పరిశీలించారు. పెద్దమల్లారెడ్డి గ్రామంలో చెరువు కింద సుమారు వెయ్యి ఎకరాలు పూర్తిగా నష్టపోయినట్లు రైతులు తెలిపారు. వరిధాన్యంతో పాటు మామిడి, మొక్కజొన్న, కూరగాయల పంటలకు కూడా భారీ నష్టం వాటిల్లింది. పంటలు పూర్తిగా దెబ్బతిన్న పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించి రైతులతో మాట్లాడారు. బాధిత రైతులను పరామర్శిస్తూ ధైర్యం చెప్పి ప్రభుత్వం తరపున సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. సంబంధిత వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో సమావేశమై వెంటనే పంట నష్టం సర్వే చేపట్టి సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించారు. రైతులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని షబ్బీర్ అలీ సూచించారు. నివేదిక అందిన వెంటనే సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి నష్టపోయిన రైతులకు తగిన నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని తెలిపారు.



రైతుల కష్టాన్ని ప్రభుత్వం గుర్తించి వారికి పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పీసీసీ జనరల్ సెక్రెటరీ ఇంద్రకరణ్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, మండల అధ్యక్షుడు సుతారి రమేష్, భీంరెడ్డి, అనంతరెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ పాత రాజు, డీసీసీ ఉపాధ్యక్షుడు గంపప్రసాద్, ఐరేనీ సందీప్ తదితరులు పాల్గొన్నారు.



## వేతనాల కోసం మిషన్ భగీరథ సిబ్బంది నిరసన

**అక్షరటుడే, బాల్కొండ :** మిషన్ భగీరథ ఉద్యోగులు నిరసన బాట పట్టారు. తమకు జీతాలు చెల్లించాలని పేర్కొంటూ పంప్‌హౌస్ వద్ద నినాదాలు చేశారు. బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలో మిషన్ భగీరథ తాగునీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న లైన్‌మెన్లు, సిబ్బంది తమకు రావాల్సిన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వారు పంప్‌హౌస్ ఎదుట నినాదాలు చేశారు. ఆర్నెళ్లుగా తమకు జీతాలు లేక తాము అనేక ఇబ్బందులు పడుతున్నామని ఉద్యోగులు అన్నారు. అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. వెంటనే బకాయిలు చెల్లించాలని వారు కోరారు. నిరసన కార్యక్రమంలో మిషన్ భగీరథ సూపర్‌వైజర్ నాగరాజ్, విఘ్నేష్, నరేందర్, గంగాధర్, సుదీర్, సతీష్, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.



## పాఠశాలల్లో గైర్హాజరును తగ్గించాలి

**అక్షరటుడే, కోటగిరి :** పాఠశాలల్లో గైర్హాజరును తగ్గించాలని సబ్ కలెక్టర్ వికాస్ మహతో సూచించారు. కోటగిరి మండలంలోని ఎత్తొండ గ్రామంలో ఉన్న ఎంపీయూపీఎస్‌ను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికను సబ్ కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థుల గైర్హాజరును తగ్గించడంపై దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 6వ తరగతి విద్యార్థుల ఎండ్ లైన్ పరీక్ష పత్రాలను సమీక్షించారు. విద్యార్థుల చదవడం, రాయడం నైపుణ్యాలను కూడా అంచనా వేసి, ప్రత్యేక కృషి ద్వారా మెరుగుపరుచుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. విద్యార్థుల ప్రతిభపై సబ్ కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పీరియడ్ ప్లాన్ ప్రకారం వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అభ్యసన ఫలితాలను మెరుగుపరచడానికి ఉపాధ్యాయ సహాయక బృందం విద్యార్థులపై అదనపు శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. ఆయన వెంట తహశీల్దార్ గంగాధర్, ఎంఈవో శ్రీనివాస్ రావు, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

## ద్వితీయ శ్రేణి నగరాల్లో ఐటీని విస్తరించాలి




**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్ :** రాష్ట్రంలోని ద్వితీయశ్రేణి నగరాల్లో ఐటీని విస్తరించి నిరుద్యోగ యువతకు బాసటగా నిలవాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గురువారం ఐటీ, మున్సిపల్ అంశాలపై మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఇందూరులో నిర్మించిన ఐటీ హబ్ నిరాధరణకు గురవుతోందని వివరించారు. సుమారు రూ.45 కోట్ల వ్యయంతో నిర్మించిన ఐటీ హబ్‌లో 23 కంపెనీలు ఉండాల్సింది కేవలం 10 మాత్రమే పనిచేస్తున్నాయన్నారు. అవి కూడా ఎంఎన్‌సీ కంపెనీలు కాకుండా స్టార్టప్, బీపీవోలు ఉన్నాయన్నారు. ప్రధానంగా డిగ్రీలు, పీజీలు చేసిన వేలాది మంది నిరుద్యోగ యువత గల్ఫ్ బాట పట్టే పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాగే స్థానిక యువత హైదరాబాద్‌లో తక్కువ వేతనాలకు ఉద్యోగాలు చేసి ఇబ్బందులకు గురవుతున్నారని, అదే సొంత నగరాల్లో ఐటీ ఉద్యోగాలు కల్పిస్తే వారికి ఆసరాగా ఉండే అవకాశం ఉంటుందన్నారు. నిజామాబాద్‌లో ఉన్న రామర్తి చెరువు, బొందెం చెరువు, పులాంగ్ వాగు సగానికి పైగా కబ్జాకు గురవుతున్నాయని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అలాగే జిల్లా కేంద్రంలో రెండు చోట్ల ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటు చేయాలని, ఫుట్ పాత్ కబ్జాలపై దృష్టి సారించాలన్నారు. మాస్టర్ ప్లాన్ అమలు చేస్తే కబ్జాలను అరికట్టే అవకాశం ఉంటుందన్నారు. అలాగే నగర సుందరీకరణ కూడా జరుగుతుందని వివరించారు.

## పెండింగ్ పనులను వెంటనే ప్రారంభించాలి




**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డిలో ఇటీవల వచ్చిన వరదల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న లింగంపల్లి ఖుర్ద్ వంతెన, ఆడివి లింగాల వంతెనతో పాటు ఇతర పెండింగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలని ఎమ్మెల్యే మదన్ మోహన్ కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఆయన ఎల్లారెడ్డిలో నియోజకవర్గంలోని పలు సమస్యలపై మాట్లాడారు. లింగంపల్లి ఖుర్ద్ వంతెన, అడివిలింగాల వంతెనలు నాగిరెడ్డిపేట, లింగంపేట, ఎల్లారెడ్డి మండలాల మధ్య రాకపోకలకు కీలకమని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యంగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో రైతుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో, ఈ మార్గాలు రైతులకు అత్యంత ప్రాధాన్యత కలిగినవన్నారు. వారి వ్యవసాయ కార్యకలాపాలకు ప్రధాన రవాణామార్గాలుగా ఉపయోగపడుతున్నాయని వివరించారు. సదాశివనగర్, గాంధారి, రాజంపేట, తాడ్వాయి, రామారెడ్డి మండలాల్లో పాత వంతెనలు ఏళ్లక్రితం కట్టినవని.. వాటితో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖ, ఆర్అండ్‌బీ శాఖల ద్వారా తక్షణమే నిధులు విడుదల చేసి, వంతెనల నిర్మాణాన్ని పూర్తి చేయాల్సిన అవసరాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఇటీవల వచ్చిన భారీ వరదల కారణంగా మండల కేంద్రాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు కూడా దెబ్బతిన్నాయని తెలిపారు. ఈ సమస్యను అత్యవసరంగా పరిష్కరించేందుకు తక్షణ నిధులు మంజూరు చేసి, ప్రభుత్వ కార్యాలయాల మరమ్మతులు, నిర్మాణ పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు.

## కాళేశ్వరం ప్యాకేజీ పనులను పూర్తి చేయాలి



**అక్షరటుడే, బాల్కొండ:** కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి కోరారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా జీరో అవర్‌లో ఇరిగేషన్ శాఖకు సంబంధించి బాల్కొండ నియోజకవర్గంలోని ప్యాకేజీ-21, చిట్టాపూర్, ఫత్తేపూర్, సుర్బిర్యాల్ లిఫ్ట్ సమస్యలను లేవనెత్తారు. కాళేశ్వరం ప్యాకేజీ 20, 21, 21 A ప్రాజెక్టు ద్వారా నిజామాబాద్ జిల్లాలో సుమారు 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడానికి గత కేసీఆర్ ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఈ ప్రాజెక్టు కోసం గత ప్రభుత్వం రూ.4,800 కోట్లు కేటాయించగా, ఇప్పటికే రూ.3,300 కోట్లు ఖర్చుచేసి 70 శాతం పనులు పూర్తయ్యాయని ప్రశాంత్ రెడ్డి అన్నారు. మిగిలిన 30శాతం పనులు పూర్తి చేస్తే 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించవచ్చని పేర్కొన్నారు. దీని ద్వారా రైతులకు మేలు జరుగుతుందని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. మెట్‌పల్లి సెగ్మెంట్ ప్యాకేజీ 21ఏ లోనే బాల్కొండ నియోజకవర్గంలో 70,000 ఎకరాలు, నిజామాబాద్ రూరల్ జక్రాన్‌పల్లి మండలం రూ.29,000 ఎకరాలు, కోరుట్ల నియోజకవర్గం మెట్‌పల్లి, ఇబ్రహీపట్నం ప్రాంతంలో 19,000 ఎకరాలు, ఆర్మూర్, మాక్లూర్‌లో 5000 ఎకరాలు మొత్తంగా సుమారు 1,20,000 ఎకరాలు ఉంటుందని చెప్పారు. ఇరిగేషన్ ప్రాజెక్ట్ మెట్‌పల్లి సెగ్మెంట్ పనుల్లో హెడ్ వర్క్స్, పంపు హౌజ్, మెయిన్ పైప్‌లైన్ పూర్తయి దాదాపు 80శాతం పనులు పూర్తయ్యాయని వివరించారు. మరో రూ.500 కోట్లు ఖర్చుచేస్తే 1.20 లక్షల ఎకరాలకు నీరు అందించవచ్చన్నారు.

## కరాటేలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు ప్రశంస



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఇటీవల నిర్వహించిన కరాటే జాతీయస్థాయి పోటీల్లో ఇందూరు కరాటే క్రీడాకారులు ప్రతిభ చూపి జాతీయస్థాయి మెడల్లు సాధించారు. ఈ సందర్భంగా సీపీ సాయిచైతన్య వారిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణతో కూడిన కరాటే నిత్య జీవితంలో మానసిక ఉల్లాసానికి శారీరక దృఢత్వానికి దాంతో పాటుగా ఆత్మ రక్షణకు ఎంతగానో ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. మెడల్లు సాధించిన వారిలో.. వైభవ్ తేజ్, సాయి నిహాల్, రిత్విక్, రిత్య శ్రీ, కార్తికేయ, నందిక గౌడ్, శ్రీనందన్ గౌడ్, రక్షిత్, శ్రేయస్, సహస్ర, నచికేతన్, శ్రీనిక, లాస్య, వినూత్న, జయనిత్, ప్రీతిక, రానా, హర్షిత్, సహస్ర, భవేష్, జాహ్నవి, సుశీల్ ఉన్నారు.

## ఠాణా పక్కన ఖాళీ స్థలంలో నిర్మాణాలు చేపట్టొద్దు



**అక్షరటుడే, లింగంపేట:** మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ పక్కన ఖాళీస్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని లింగంపేట అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఆ స్థలాన్ని టూరిజం శాఖకు, మహిళా సంఘాల సభ్యుల పెట్రోల్ బంకు కోసం కేటాయించారన్నారు. అయితే ఆ ఖాళీస్థలాన్ని రైతులకు ధాన్యం ఆరబెట్టినందుకు, యువకులకు క్రీడా మైదానంగా ఉంచాలని కోరారు. ఐదేళ్ల క్రితం క్రీడా మైదానంగా ఆ స్థలాన్ని కేటాయించినట్లు గుర్తు చేశారు. నాగన్న బావి పర్యాటక కేంద్రం కాటేజీల కోసం లింగంపేటలో ఖాళీగా ఉన్న మరో ప్రభుత్వ భూమిలో వసతి భవనాలను నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కౌడ రవి, రఫీయొద్దీన్, బొల్లారం క్రాంతికుమార్, ముదాం సాయిలు, డిష్ అశోక్, చేపూరి పోశెట్టి, బాలయ్య, రాములు, సత్యం పాల్గొన్నారు.

## ఉపాధి హామీ నిధులు కేటాయించాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** నెమ్లి గ్రామానికి ఉపాధి హామీ నిధులు కేటాయించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ పార్టీ ఆధ్వర్యంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఏవో వసంతకు వినతిపత్రం ఇచ్చారు. సర్పంచ్ సింగిరెడ్డి రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం కింద కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పటికీ, నెమ్లి గ్రామానికి కేటాయింపులు చేయకపోవడం బాధాకరమని అన్నారు. తాము బీజేపీకి చెందిన సర్పంచ్ కావడంతో ఉద్దేశపూర్వకంగానే నిధులు నిలిపివేశారని ఆరోపించారు. బాన్సువాడ టౌన్ అధ్యక్షుడు కోనాల గంగారెడ్డి, జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్, చందూరి హన్మాండ్లు, గజ్జల మహేష్, ప్రసాద్, పైడిమాల్ లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, శ్యామల శ్రీకాంత్, మహేందర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్మైల్స్ ఫియెస్టా కార్యక్రమం



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని స్మైల్స్ ది స్కూల్స్‌లో విద్యార్థుల గ్రాడ్యుయేషన్ సందర్భంగా ఫియెస్టా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్కూల్ ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ షబానా గోహర్ మాట్లాడుతూ.. పాఠశాలలో మెరుగైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రఫీ గోహర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పలువురికి జాతీయ అవార్డుల ప్రదానం




**అక్షరటుడే, బోధన్:** వైద్యుల గ్లోబల్ ఫౌండేషన్, వసుంధర విజ్ఞాన వికాస మండలి ఆధ్వర్యంలో పలువురికి జాతీయ అవార్డుల పురస్కారాలు అందజేశారు. సాలూర మండల కేంద్రానికి చెందిన రైతు ఇల్తెపు గంగారాం పుడమిపుత్ర జాతీయ అవార్డు, బోధన్ పట్టణానికి చెందిన చిత్రకారిణి ఎర్రోల్ల అవంతికి బాపు చిత్ర కళారత్న జాతీయ అవార్డు, కరాటే మాస్టర్ పల్లవికి ఝాన్సీలక్ష్మీబాయి శౌర్య పురస్కారం అందజేశారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో గురువారం రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ చేతుల మీదుగా ఈ పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు మధుకర్ వైద్యుల, కోశాధికారి సుమలత, కార్యదర్శి లింబూరి లక్ష్మణ్ పాల్గొన్నారు.





# రాములోరి కల్యాణానికి సర్వం సిద్ధం..

**నిజామాబాద్ నగరంలోని ఖిల్లా రఘునాథ ఆలయంలో శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా సీతారాముల కల్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో ప్రత్యేకంగా షామియానాలు.. తాగునీటి సౌకర్యం, క్యూలైన్లు ఏర్పాటు చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం, పట్టువస్త్రాల సమర్పణ, తలంబ్రాలు సమర్పించే కార్యక్రమాలు జరుగనున్నాయి. అలాగే నగరంలోని సుభాష్‌నగర్, బ్రహ్మపురి తదితర ఆలయాల్లో సైతం శుక్రవారం రామనవమి వేడులకు జరుగనున్నాయి.**

**– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నిజామాబాద్**







# సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు వెళ్తాం..





**అక్షరటుడే, కామారెడ్డి/ బాన్సువాడ:** తమ సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు వెళ్తామని విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు కామారెడ్డి, బాన్సువాడ విద్యుత్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పట్టణంలోని విద్యుత్ కార్యాలయం వద్ద తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కామారెడ్డి డివిజన్ ఛైర్మన్ సునీల్ గౌడ్ మాట్లాడుతూ.. ఆర్టిజన్ విద్యుత్ కార్మికులకు ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్ కార్మికులను విద్యుత్ శాఖ శాశ్వత కార్మికులుగా గుర్తించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్లను అమలు చేయకపోతే వచ్చే నెల 8న రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కార్మికులు సమ్మె లో పాల్గొంటామన్నారు. బాన్సువాడ విద్యుత్ డివిజన్ కార్యాలయం ఎదుట విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్టిజన్, పీస్ రేట్, అన్‌మ్యాన్డ్ కార్మికులు భారీగా ధర్నా నిర్వహించారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. తమకు రావాల్సిన వేతనాలు, ఇతర సౌకర్యాలు ఇప్పటికీ అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ శ్రమకు తగిన గుర్తింపు ఇవ్వాలని వారు కోరారు. పని భారం తగ్గించడంతో పాటు మ్యాన్‌పవర్ పెంచాలని, పీఆర్‌సీ పెంపు చేయాలని, పీస్ రేట్ విధానాన్ని రద్దు చేసి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. ధర్నాలో బాన్సువాడ, బిచ్కుంద ఉమ్మడి డివిజన్‌కు చెందిన సుమారు 170 మంది కార్మికులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి సమీ, నాయకులు శివకుమార్, వినోద్, సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడ్డ వారికే పార్టీలో పదవులు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ వారికే పదవులు దక్కుతాయని డీసీసీ కార్పొరేషన్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ పేర్కొన్నారు. నూతనంగా నిజామాబాద్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యులుగా నియమితులైన సభ్యులకు గురువారం పార్టీ కార్యాలయంలో నియామక పత్రాలు అందజేశారు. బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ.. పార్టీ కోసం చేసిన కృషిని గుర్తించి పదవులు అప్పజెప్పామన్నారు. ఎవరు కూడా పదవిని దుర్వినియోగం చేయకూడదని పార్టీ అభ్యున్నతి కోసం మాత్రమే పాటుపడాలన్నారు. రాబోయే రోజుల్లో నిజామాబాద్ అర్బన్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే గెలవడానికి కృషి చేయాలని సూచించారు. కార్యవర్గంలో ఉన్న ఉపాధ్యక్షులు, అధికార ప్రతినిధులు, ప్రధాన కార్యదర్శులను నిజామాబాద్ అర్బన్‌లోని పలు డివిజన్లకు ఇన్‌ఛార్జ్‌లుగా నియమిస్తామన్నారు. ఇన్‌ఛార్జ్‌లుగా నియామకమైన వారు.. ఆ డివిజన్లలో పూర్తి సమయాన్ని కేటాయించాలని రామకృష్ణ సూచించారు. అదేవిధంగా కార్యవర్గ సభ్యులకు పీసీసీ ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం ఉంటుందని అందులో పాల్గొనాల్సిందిగా అందరికీ సూచించారు. ఎవరైనా పార్టీ చేస్తున్న కార్యక్రమాలలో పాల్గొనకపోతే తక్షణమే వారిని ఆ పదవి నుంచి తొలగించి వేరే వారిని నియమిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నుడా ఛైర్మన్ కేశ వేణు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, రాష్ట్ర ప్రచార కమిటీ మెంబర్ జావిద్ అక్రం హాజరయ్యారు.

## భీమ్‌గల్‌లో ముగిసిన తైబజార్ వేలం

**అక్షరటుడే, భీమ్‌గల్:** భీమ్‌గల్ పురపాలక సంఘం పరిధిలోని తైబజార్ వేలం ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను నిర్వహించిన ఈ వేలంలో మహమ్మద్ అబ్దుల్ ఫయాజ్, చెప్పల గంగాధర్ పాల్గొన్నారు. గత ఏడాది (2025 26) తైబజార్ వేలం పాట రూ. 9,91,000 పలకగా, ఈసారి అంతకంటే సుమారు 5 శాతం అధికంగా పలికింది. మహమ్మద్ అబ్దుల్ ఫయాజ్ రూ.10,41,000కు పాట పాడి వేలాన్ని దక్కించుకున్నారు.

## పేకాడుతున్న నలుగురి అరెస్ట్

**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలోని కిసాన్‌నగర్‌లో పేకాట ఆడుతున్న పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై శైలేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి కిసాన్‌నగర్‌లో పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారంతో దాడులు చేశామన్నారు. ఈ క్రమంలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1,800, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## డ్రంకన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** డ్రంకన్ డ్రైవ్ కేసులో పలువురికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు నిచ్చారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మస్తాన్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలో ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో తనిఖీలు చేస్తుండగా.. 13 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ దొరికారు.

### భారీ జరిమానాలు..

అందులో అతిగా మద్యం సేవించిన ఇద్దరికి వారంరోజుల జైలుశిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ హైమద్ మెయిద్దీన్ తీర్పునిచ్చారు. అలాగే మరో 11 మందికి రూ. 10వేల చొప్పు న జరిమానా విధించినట్లు ఏసీపీ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం మత్తులో వాహనాలు నడిపి ఇతరులకు ముప్పు తేవద్దని పేర్కొన్నారు.

### ఆర్మూర్‌లో..

**అక్షరటుడే, ఆర్మూర్:** డ్రంకన్ డ్రైవ్ కేసులో ఆర్మూర్ కోర్టు ఇద్దరికి జైలు శిక్ష విధించింది. ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలో తనిఖీలు చేస్తుండగా.. ఏడుగురు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లుగా గుర్తించారు. వారిని కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి రూ. 10వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చిందని ఎస్‌హెచ్‌వో తెలిపారు.



## రోడ్లపై గుంతల పూడ్చివేత

**అక్షరటుడే, మెండోరా:** మెండోరా మండలం కోడిచెర్ల గ్రామంలో గురువారం 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సై సుహాసిని ఆధ్వర్యంలో సర్పంచ్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ ప్రసాద్, గ్రామ పెద్దలు, పంచాయతీ సిబ్బంది కలిసి రోడ్ల మరమ్మతులు చేపట్టారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామ ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.



## ధర్మ భిక్షం చేసిన సేవలు మరువలేనివి..

**అక్షరటుడే, కోటగిరి :** మండల కేంద్రంలో రాష్ట్ర గీత పనివారి సంఘ ఆధ్వర్యంలో మాజీ ఎంపీ ధర్మ భిక్షం వర్ధంతిని నిర్వహించారు. స్థానిక గీత పరిశ్రమ సహకార సంఘం భవనంలో ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర గీత పనివారి సంఘం రాష్ట్ర కార్యదర్శి విఠల్ గౌడ్ మాట్లాడుతూ.. కల్లు గీత కార్మికుల కుటుంబాల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడు ధర్మ భిక్షం అని అన్నారు. కల్లు సొసైటీలు ఏర్పాట్లు గీత కార్మికులకు టీఎఫ్‌టీ లైసెన్సులు, వృద్ధులకు పెన్షన్, వనం పెంపకానికి భూముల కోసం పోరాడిన మహనీయుడు ధర్మభిక్షం అని పేర్కొన్నారు. తన జీవితంతం గీత కార్మికుల కోసం ఆయన పని చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కోటగిరి టీసీఎస్ అధ్యక్షుడు శంకర్ గౌడ్, గీత పనివార్ల సంఘం మండల నాయకులు వెంకట్ గౌడ్, శ్రీధర్ గౌడ్, రాజా గౌడ్, నరేష్ గౌడ్, గీత కార్మికులు శ్రీనివాస్ గౌడ్,సాయి కృష్ణ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, మొలాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## పీఎం విశ్వకర్మ కిట్ల పంపిణీ

**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని పోస్ట్ ఆఫీస్ వద్ద గురువారం బీజేపీ నాయకులు, పోస్ట్ ఆఫీస్ సిబ్బంది కలిసి పీఎం విశ్వకర్మ లబ్ధిదారులకు కిట్లు పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్ రావు మాట్లాడుతూ ఇప్పటివరకు దాదాపు 200 మందికి పీఎం విశ్వకర్మ పనిముట్లు అందించినట్లు తెలిపారు. ఇందులో కుట్టు మిషన్లు, దుగడ మెషిన్లు, ఇటుక సంచా, వడ్రంగి సామాన్లు ఉన్నాయని వెల్లడించారు. లబ్ధిదారులు ఏ సామాను కావాలో దరఖాస్తు చేసుకుంటే వారికి అదే సామగ్రి లభిస్తుందని తెలిపారు. ఈ పథకాన్ని విశ్వకర్మలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులతో పాటు బీజేపీ నాయకులు పోస్ట్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తున్నాం..



**అక్షరటుడే, ఆర్మూర్:** అసెంబ్లీలో ఇప్పసార అంశంపై ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు కాంగ్రెస్ ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు, ఏఎంసీ ఛైర్మన్ సాయిబాబా గౌడ్ అన్నారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ఆర్మూర్ ప్రజలు రాకేష్ రెడ్డిపై నమ్మకంతో ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధి గురించి అసెంబ్లీలో మాట్లాడి నిధులు తేవాల్సింది పోయి.. ఇప్పసారా, నాటుసారా అంశంలో ఇందిగా గాంధీ పేరు తీసుకురావడం సరైంది కాదన్నారు. అభివృద్ధిని పక్కకు పెట్టి కాంగ్రెస్ పార్టీ నాయకులపై కాంగ్రెస్ పార్టీపై మాట్లాడడం సమంజసం కాదని అన్నారు. ఇందిరాగాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.